న్యూజెర్సీ తెలుగు కళాసమితి ‘ప్రజాపతి ఉగాది’ కథల పోటీలో రూ. 400/-లు తృతీయ బహుమతి పొందిన కథ

# గోర్కీ పాత్ర



— డాక్టర్ వి.చంద్రశేఖర్



“గోర్కీ కథ ఒకటి ట్రాన్స్‌లేట్ చేసిపెట్టవా? ఈ రాత్రికెటూ కేసులు వచ్చేలా లేవు. మా స్త్రీ శక్తి సంఘటన తరపున సావనీరు రిలీజ్ చేస్తున్నాం. ఈ కథ అందులో వుండి తీరాలి. ప్లీజ్: కాదనవద్దు. రెండు కప్పుల టీ, నీ ఏకాంత నిశ్శబ్ద విషాదాన్ని డిస్టర్బ్ చెయ్యననే హామీ, అఫ్‌కోర్సు కృతజ్ఞతాపూర్వకంగా సావనీరు కాపీ నీకు రెమ్యూమరేషన్‌గా ఇస్తాను” లేబరు వార్డులో, హౌస్ సర్జన్స్ డ్యూటీ రూమ్‌లో పరిసరాల్ని పట్టించుకోని ఎస్కేప్‌లో వున్న నాపై దాడి చేసినట్లుగా, గోర్కీ కథల సంపుటం, నోట్ బుక్, పెన్‌తో సహా అభ్యర్థనా పూర్వకమైన కమాండ్‌తో సరళ ప్రత్యక్షమైంది. సరళ నాతోటి హౌస్‌సర్జన్. ఇప్పటివరకు నర్సింగ్ స్టూడెంట్లకు ‘దాస్ కేపిటల్’లోని ముఖ్యాంశాలపై రెండు గంటల లెక్చరు యిచ్చింది. ఇప్పుడు నాపై దాడి. సరళను చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఇరవై యేళ్ళయినా దాటని ఈ యువతిలో ఎంత పరిణితి! ఎంత హుందాతనం సాధారణంగా ఆ వయసు అమ్మాయిలు మధురమైన ఊహల్తో, ఒక అసహజమైన అమాయకమైన వాతావరణంలో జీవిస్తూ వుంటారు. కానీ ఈ సరళ ఇంత చిన్న వయసులోనే వర్గరాహిత్య సమాజం గురించి కలలు కంటూంది. కొంతమంది కాలేజీ యువతులతో కలిసి ‘స్త్రీ శక్తి సంఘటన’ అనే సంస్థను ఏర్పాటుచేసింది.

స్త్రీల సమస్యలపై కరపత్రాలు, పుస్తకాలు ప్రచురించడం, ముఖ్యమైన సమస్యలపై వూరేగింపులు, ధర్నాలు చెయ్యడంతో ఎప్పుడూ బిజీగా వుంటుంది. ఎస్కేపిస్టువని నాకు లేబుల్ వేస్తుంది. నా కథలు కాలక్షేపం బఠాణీలని వెక్కిరిస్తుంది. అయినా సరళంటే నాకు ప్రాణం. నాకున్న ఒకే ఒక ఆంతరంగిక నేస్తం సరళ ఇద్దరం సాయంకాలాన్ని, జీవితపు వ్యథని, దాని అంతుపట్టని తవాన్ని పంచుకుంటూ వుంటాము. తన సావనీరులోని కథ కోసం ప్రత్యేకంగా నన్ను ఎన్నుకోవడం గొప్ప థ్రిల్ కలిగించింది.

రాత్రి ఎనిమిది గంటల వేళ ఒక డెలివరీ అయింది. అప్పటి నుంచి ఖాళీ. డ్యూటీ గైనకాలజిస్టు డాక్టర్ వసుంధర “కేసులు లేకపోతే విసుగేస్తుంద్రా! అలా తిరిగొస్తాను” అంటూ పక్క

# ఎందుకంటే...



— జి. భవానీరమణ

**నరేంద్ర గాడి ఇరవై నాలుగో పెళ్ళి చూపుల కార్యక్రమం పూర్తి చేసి కాలుబయట పెట్టాక వెంట వెళ్ళిన నేను అడిగాను. "అమ్మాయి బాగానే వున్నట్లుంది బహుశా నీకు నచ్చుతుందనుకుంటాను"**

ఆ మాటకి అది ఏం భావమో అర్థం కాకుండా మొహం పెట్టి, "అంతా బాగానే వుంది కానీ ఆ కళ్ళజోడుంది చూశావ్, అది బాగా లేదు" అన్నాడు. అప్పటే ఈ సంబంధం కూడా ఇంతే సంగతులని వేరే చెప్పనవసరం లేదు. అసలీ వేట ప్రారంభం కాకముందే అడిగాను, 'నీకెలాంటి అమ్మాయి కావాలని.

"ఉద్యోగం చేసే అమ్మాయి అయితే చాలు, ఈ రోజుల్లో ఒక్కడి జీతం మీద బతకడం ఎంత కష్టమో నీకు చెప్పనవసరం లేదు గదా" అన్నాడు. నిజమే అనుకుని ఓ ఉద్యోగం చేసే అమ్మాయిని (సంబంధం) చూపించాను. తీరా చూశాక అమ్మాయి అందంగా లేదన్నాడు. అంటే ఉద్యోగం చేస్తూ అందంగా (తన దృష్టిలో) వున్న అమ్మాయి కావాలన్నమాట! మరీ మొదటి సంబంధమే ఎలా కుదురుతుందిలే అని అటువంటిదే ఇంకో సంబంధం ఎవరో చెప్తే అదే వాడి చెవిన వేశాను. మళ్ళీ పెళ్ళి చూపుల ప్రహసనం పూర్తయ్యాక, "అమ్మాయిని గవర్నమెంట్ ఉద్యోగం కాకపోయినప్పుడు మనకెందుకూ" అన్నాడు.

...అంటే గవర్నమెంట్ ఉద్యోగం చేస్తున్న అందమైన అమ్మాయి కావాలన్నమాట. ...అలా... అలా ఇప్పటికి ఇరవై మూడు సంబంధాలూ చూస్తూ వస్తున్న నరేంద్రగాడికి తనకి కావలసింది వాళ్ళ దగ్గర ఏం మిస్సవుతోందో బయటపడుతూ కేవలం ఉద్యోగం చేసే అమ్మాయయితే చాలునన్నవాడికి ఇప్పుడు.. 1. ఉద్యోగం (గవర్నమెంటు, పర్మనెంట్ అయిన) చేస్తూ 2. చాలా అందమయినదీ 3. చాలా చిన్న కుటుంబంలోనుంచి వచ్చినదీ 4. కాబోయే మామగారు చిన్నా చితకా ఉద్యోగం చేసే వారు కాకుండా వీలయితే ఎగ్జిక్యూటివ్ కేడర్‌కి తక్కువ కాని వారు మాత్రమే అయి వుండీ 5. తోడల్లుళ్లూ, బావమరుదులూ కూడా ఉన్నతస్థాయిలో వున్న వారయి వుండీ 6. ఇంకా... 7. ఇంకా... 21. జాతకాలు కలిసీ 22. కట్న కానుకలు ఇవ్వకపోయినా లాంఛన ప్రాయంగా కనీసం కలర్ టీవీ గానీ, ఫ్రిజ్ గానీ మరి అలాంటిది ఏదో ఒకటైనా ఇచ్చి 23. పెళ్ళి ఘనంగా జరిపించగలిగి వుండాలి... ఇవన్నీ కాక ఇప్పుడు 24వది అమ్మాయి జోడు (ప్రస్తుతానికి కళ్ళకు మాత్రమే) వాడనిదై వుండాలి. మళ్ళీ ఇంకో సంబంధం చూస్తే గానీ ఇవన్నీ కాక ఆ అమ్మాయికి ఇంకేదైనా వుండాలేమో తెలియదు!

నేను చెప్పేదంతా వింటూ నరేంద్రగాడు యే ఐ.ఎ.ఎస్సో, ఐ.పి.ఎస్సో అని మీకు అనుమానం వస్తే మీరు పప్పులో కాలేసినట్లే. శాఖోపశాఖలుగా విస్తరించిన అనేకానేక ప్రభుత్వ ఆఫీసుల్లో ఒకానొకదాంట్లో వాడు 'క్లర్కు' మాత్రమే. అయితేనేం, తనబోటి వాణ్ణి చేసుకోవాలంటే అమ్మాయి ఎంత అదృష్టవంతురాలయి వుండాలి? ఇది వాడి అభిప్రాయమే, నాది కాదు.

"అయితే ఇంకో సంబంధం చూడాల్సిందే నంటావ్?" సాలోచనగా వాడి మొహంలోకి చూస్తూ అన్నాను నేను. "నీ అందానికీ, హోదాకీ సరిపడేలా వీళ్ళల్లో ఒక అమ్మాయిని ఎంచుకుని సరిపెట్టుకోలేవా?"

"అవకాశం వున్నప్పుడు సరిపెట్టుకోవలసిన ఖర్మ నాకేమిటి? ఈ అమ్మాయి కాకపోతే మరో అమ్మాయి" అన్నాడు వాడు.

ఈ సరిపెట్టుకోకపోవడమన్నది 'అవకాశం' వుండడం వల్ల అన్న విషయం నాకప్పుడు గానీ అర్థం కాలేదు. ఈ అవకాశమనేదే లేకపోతే?... సమాజంలో ఈ అవకాశం ప్రస్తుతం మగాడికే ఇస్తున్నాం కదా, అదే ఆడదానికి ఇస్తే? బహుశా ఈ కథ పుంలింగ ప్రధానంగా కాక స్త్రీలింగ ప్రధానంగా నడిచేదేమో తప్ప వేరే మార్పేమీ వుండేది కాదనుకుంటా! మనస్తత్వానికి సంబంధించినంతవరకూ ఆడైనా మగైనా మనిషే కదా!!

మొత్తం మీద తర్వాతి అయిదు సంవత్సరాల కాలం వరకూ కూడా నరేంద్రగాడు సంబంధాలు చూస్తూ సెంచరీ పూర్తి చేశాడు. ఈలోగా నేను పెళ్ళి చేసుకుని ఇద్దరు పిల్లల తండ్రిని కూడా అయ్యాను. చివరికి ఎవరిదో సలహా మీద పేపరు ప్రకటన ఇచ్చాడు 'వధువు కావలెను' అని. ఆ రోజు వాళ్ళింటికి వెళ్తే వచ్చిన అప్లికేషన్లని నా ముందు పడేశాడు చూడమని. వాడి పెళ్ళి విషయం నాకు తలనొప్పిపోయి కోపం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఎంత ప్రాణ స్నేహితుడైనా వాడి ఆలోచన సమంజసంగా లేనప్పుడు సమర్థించడం తప్పు అనుకుని, వాటిని కనీసం చేతిలోకైనా తీసుకోకుండా చిరాకుగా అన్నాను, "బహుశా అన్ని పెళ్ళి చూపులూ పూర్తయి ఎవ ఎవరికీ నచ్చక ఇక పెళ్ళే కాదని ఆఖరి అవకాశంగా ఇలా అప్లై చేసుంటారు వీళ్ళంతా. నీకు అటువంటి వాళ్ళే కావాలనుకుంటే చూసి చెప్తాను."

ఈ విషయాన్ని నేను చెప్పిన కోణం నుండి చూడకపోవడం చేత నా మాటలకి విస్తుపోయినట్లయి, తేరుకున్నాక ఆ అప్లికేషన్లన్నీ పక్కకి నెట్టేసి, "మరేం చెయ్యమంటావు" అన్నాడు దీనంగా.

31వ పేజీలో [illegible]

గోర్కీపాత్ర...28వ పేజీ తరువాయి

ఈ ఆపరేషనుకు బ్లడ్ ఎంత అవసరమో నాకు తెలుసు. వాది బి.పాజిటివ్ కదా..." సరళ నవ్వుతూ చెబుతున్నా నా కళ్ళలో నీళ్ళు. ఎంత త్యాగం! గోర్కీ కథ చదివినప్పుడు ఆ కథలోని పాత్రల మంచితనం, త్యాగనిరతి నన్ను విస్మయ పరిచాయి. అలాంటి వ్యక్తులు కొద్దిమందైనా మన మధ్య వుండబట్టే ఇంత కుళ్ళు, ఇంత దుర్మార్గం, ఇంత మోసం వున్న ఈ ప్రపంచంలో మనం ఈ మాత్రంగానైనా బ్రతక గలుగుతున్నామని పించింది. సరళ సజీవంగా మన మధ్య జీవిస్తున్న గోర్కీ పాత్ర. ●

(రిత్విక్‌కి పుట్టిన రోజు కానుకగా)